# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-08-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు కేంద్ర ఆర్థిక మంత్రితో సమావేశమవుతారు.**

**2. ఆంధ్రప్రదేశ్ సర్క్యులర్ ఎకానమీ, వ్యర్థాల పునర్వినియోగ విధానం 4.0కు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.**

**3. జీఎస్టీ ధరల సరళీకరణ నేపథ్యంలో రాష్ట్రాల ఆదాయానికి భద్రత కల్పించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.**

**4. ఆంధ్రప్రదేశ్ లో డీఎస్సీ మెరిట్ జాబితాను ఈ రోజు విడుదల చేయనున్నామని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు.**

**5. తెలంగాణ మేడారం సమ్మక్క సారక్క జాతరకు ప్రభుత్వం 150 కోట్ల రూపాయలను కేటాయించిందని మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు ఢిల్లీలో పర్యటిస్తున్నారు. ఈ మధ్యాహ్నం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తో సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను కేంద్ర మంత్రికి వివరించనున్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా రాష్ట్రానికి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేయనున్నారు. సాయంత్రం ఢిల్లీలోని ఒక ప్రైవేటు హోటల్ లో నిర్వహించే వరల్డ్ లీడర్స్ ఫోరం సదస్సులో ముఖ్యమంత్రి పాల్గొంటారని ప్రభుత్వవర్గాలు తెలిపాయి.

--------------------------

అర్హులైన వారి పింఛన్ ప్రభుత్వం రద్దు చేయదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పథకంపై ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, నకిలీ పింఛన్లను మాత్రమే తొలిగించాలని, అర్హులైన ఏ ఒక్క దివ్యాంగ పింఛనుదారు పింఛన్ రద్దు చేయకూడదని అధికారులకు ఆదేశాలు జారీ చేశామని అన్నారు. అర్హులైన వారి పింఛన్ల యధావిధిగా కొనసాగుతాయని, దివ్యాంగులు ఎవరూ ఈ విషయంలో ఆందోళన చెందవద్దని ముఖ్యమంత్రి సూచించారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ సర్క్యులర్ ఎకానమీ, వ్యర్థాల పునర్వినియోగ విధానం 4.0కు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మొత్తం 33 అజెండా అంశాలకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. సమావేశ నిర్ణయాలను సమాచార, ప్రజా సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పాత్రికేయులకు వివరించారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో 2వేల 778 డిప్యుటేషన్, ఔట్ సోర్సింగ్ పోస్టుల భర్తీ, అధికారిక భాష కమిషన్ పేరు ... 'మండలి వెంకట కృష్ణారావు అధికారిక భాష కమిషన్ 'గా మార్చేందుకు మంత్రి వర్గం అంగీకారం తెలిపిందని చెప్పారు.పర్యాటక ప్రాజెక్టులకు ప్రభుత్వ భూముల కేటాయింపుకు మార్గదర్శకాలు సాగుభూమిని వ్యవసాయేతరంగా మార్చేందుకు.. నాలా చట్ట సవరణలకు ఆమోదం లభించిందని మంత్రి వివరిస్తూ,

వాయిస్ 30 సెకన్లు

---------------------------

వస్తుసేవల పన్ను – జీఎస్టీ ధరలను హేతుబద్ధీకరించనున్న నేపథ్యంలో రాష్ట్రాల ఆదాయానికి భద్రత కల్పించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఢిల్లీలో నిన్న జరిగిన జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణ సమావేశంలో ఆయన మాట్లాడారు, జీఎస్టీ రేట్లు సరళీకరణ దృష్ట్యా రాష్ట్రాల ఆదాయాలు క్షీణించకుండా చర్యలు చేపట్టాలన్నారు. లేకపోతే పేద, మధ్యతరగతి ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రాష్ట్రాభివృద్ధి కోసం చేపట్టిన మౌలిక వసతుల ప్రాజెక్టులకు ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పారు. రాష్ట్రాలకు నష్టం జరగకుండా ప్రస్తుతం ఉన్న పరిహార సెస్సును కొనసాగించాలని దానికింద వచ్చే ఆదాయాన్ని పూర్తిగా రాష్ట్రాలకే ఇవ్వాలని కోరారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో ఉపాధ్యాయ పరీక్షల కోసం నిర్వహించిన డీఎస్సీ మెరిట్ జాబితాను ఈ రోజు విడుదల చేయనున్నామని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడా కోటా మెరిట్ జాబితా పూర్తయినందున జాబితా విడుదల చేసేందుకు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. మెరిట్ జాబితా డీఎస్సీ అధికారిక వెబ్‌సైట్లలో ఉంచుతామని అభ్యర్థులు ఈ వెబ్‌సైట్ల నుంచి మాత్రమే సమాచారం పొందాలని సూచించారు. అభ్యర్థులు సంబంధిత అసలైన ధృవపత్రాలతో పాటు ఇటీవల తీసుకున్న కుల ధ్రువీకరణ పత్రం, గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించిన మూడు సెట్ల ఫోటో కాపీలు, ఐదు పాస్‌పోర్టు ఫొటోలతో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు.

---------------------------

తెలంగాణలోని మేడారం సమ్మక్క సారక్క జాతర ఏర్పాట్లకు ప్రభుత్వం 150 కోట్ల రూపాయలను కేటాయించిందని స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. హైదరాబాద్ లో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, తెలుగు ప్రజల గొప్ప జాతర సమ్మక్క సారలమ్మ జాతర అని చెప్పారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా మేడారం జాతరకు వసతులు కల్పిస్తున్నామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 28 సెకన్లు

---------------------------

లోక్ సభలో ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ 2025–బిల్లు ఆమోదం పొందటాన్ని

దేశవ్యాప్తంగా పలువురు స్వాగతిస్తున్నారు. కర్ణాటకలోని మైసూరు వివేక్ వాషి ఫౌండేషన్ ఆన్‌లైన్ బెట్టింగ్ వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి పాఠశాల, కళాశాల విద్యార్థులలో అవగాహన కల్పించడానికి కృషి చేస్తోంది. ఆసంస్థ అధ్యక్షులు ఎస్ బి నిత్యానంద ఈ బిల్లు ఆమోదం పొందడాన్ని స్వాగతించారు. కేంద్ర ప్రభుత్వం బెట్టింగ్ గేమింగ్ యాప్‌లను నిషేధించడానికి చట్టాన్ని ప్రవేశపెట్టడం శుభ పరిణామని ఆయన తెలియజేస్తూ,

వాయిస్ 33 సెకన్లు

---------------------------

తెలంగాణాలో వరద పరిస్థితుల సన్నద్ధతకు ప్రతీ జిల్లాకు కోటి రూపాయలను విడుదల చేశామని రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం జిల్లా కూసుమంచిలోని క్యాంప్ కార్యాలయంలో ఆయన నిన్న మాట్లాడుతూ... వర్షాలు, వరదలతో రాష్ట్రంలో ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లకుండా ఎప్పటికప్పుడు ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వాతావరణ శాఖ సూచనల మేరకు ఎలాంటి విపత్తు వచ్చినా పసిగట్టి, వరదల స్థాయిని గుర్తించే ఆధునిక పరికరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. భద్రాచలంలో ముంపు ప్రాంత ప్రజల కోసం పునరావాస కేంద్రాలు సిద్ధంచేశామని మంత్రి వివరించారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 125వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.“మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 29వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలలో దిగువ ట్రోపో ఆవరణలో నైరుతి, పశ్చిమ గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో రానున్న మూడురోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి జి.లక్ష్మీ తెలియజేస్తూ...

వాయిస్ ..30 సెకన్లు

మరోవైపు.. తెలంగాణా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. మరో నాలుగు రోజులపాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

======================